## క్లుప్తంగా

### రేపు ఇసుక డంపుల వేలం

**కడెం:** ఇటీవలే జప్తు చేసిన ఇసుక డంపులకు ఈనెల 19న బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని లింగాపూర్, ఎలగడప, గ్రామాల్లోని మొత్తం 37 ట్రాక్టర్ ట్రిప్పులకు కడెం తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కల్గినవారు రూ. ఐదు వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని కోరారు.

### విరాళం అందజేత



దాతను సన్మానిస్తున్న గ్రామస్తులు

**నర్సాపూర్(జి):** గొల్లమాడలో మహాలక్ష్మీ ఆలయ నిర్మాణానికి తిమ్మాపూర్(జి) గ్రామానికి చెందిన ఇంజినీర్ తేలు నారాయణ రూ.25వేలను విరాళంగా అందించారు. ఈసందర్భంగా దాతను గ్రామస్తులు సన్మానించారు. గొల్లమాడ మాజీ సర్పంచ్ చెన్న మహేశ్, నాకిడి లస్మయ్య, కె.లక్ష్మణ్, నాకిడి రమేశ్, గంగాధర్, సొన్న గంగాధర్, తోట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు

**బాసర:** కలెక్టర్ ఆదేశాల మేరకు బాసర మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేశామని ఎంపీడీవో అశోక్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కుటుంబ సర్వేలో పాల్గొనని మండల ప్రజలు ఈనెల 28లోగా తమ వివరాలను కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

### 'ఆదర్శ' విద్యార్థులకు ప్రశంస



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

**కుంటాల:** నెహ్రూ యువజన కేంద్రం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీవర్ధంతిని పురస్కరించుకుని కుంటాల ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కాగా విజేతలకు సోమవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువజన కేంద్రం సిబ్బంది మజీద్, యువజన సంఘాల సభ్యులు బోగ గోవర్ధన్, సిబ్బంది జక్కుల ముత్యం, గంగయ్య, గజేందర్, శ్రావణ్, పాల్గొన్నారు.

### మరమ్మతులు



పనులు చేయిస్తున్న కార్యదర్శి యోగేశ్

సాక్షి ఎఫెక్ట్..

**కుంటాల:** మండలంలోని ఓలా–లింబా(బి) వెళ్లే రోడ్డుపై తండా నుంచి వస్తున్న మురుగు నీటిపై ఈ నెల 17న సాక్షిలో మురికి నీటితో అవస్థలు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి యోగేశ్ స్పందించి పొక్లెయినర్ ద్వారా రోడ్డుకు మరమ్మతు చేయించి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు.

### 'హామీల అమలులో విఫలం'

**భైంసాటౌన్:** ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్ అన్నారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఇంటింటి సర్వే తప్పుల తడకగా ఉందన్నారు. పాత జనాభా లెక్కల ప్రకారం సర్వే నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో 4.20 కోట్లకుపైగా జనాభా ఉంటే సర్వేలో తక్కువ చూపించారని విమర్శించారు. తనను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకగా పని చేస్తానని పేర్కొన్నారు.

### ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



ఓటర్ల మద్దతు కోరుతున్న సాయన్న

**నిర్మల్‌చైన్‌గేట్:** ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యాటకారి సాయన్న అన్నారు. సోమవారం ఆయన నిర్మల్ డిగ్రీ, జూనియర్ కళాశాల మైదానంలో వాకింగ్ చేస్తున్న ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు.

# కూరగాయల 'నగర్'

- ఆదర్శంగా తండావాసులు
- ఇగురంతో ఆధునిక సేద్యం చేస్తున్న వైనం



మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధంగా కూరగాయలు



నగర్‌తండాలో సాగవుతున్న చిక్కుడు

**లోకేశ్వరం:** మండలంలోని నగర్‌తండా వాసులు సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా కూరగాయలు సాగు చేస్తూ మంచి ఆదాయం సంపాదిస్తున్నారు. పండిన కూరగాయలను సమీపంలోని మార్కెట్, వారసంతలతోపాటు నేరుగా వినియోగదారులకు విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు. మూస పద్ధతుల్లో సంప్రదాయ పంటలు సాగు చేయకుండా ఇగురంతో ఆధునిక విధానంలో కూరగాయలను పండిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**సమీపంలోని వారసంతల్లో విక్రయం..**

లోకేశ్వరం మండలకేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న నగర్‌తండాలో 80 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇందులో సుమారు 70కి పైగా కుటుబాలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో జరిగే మార్కెట్, వారసంతల్లో కూరగాయలు విక్రయించే వారిలో ఈ తండా వాసులే పది మందికి పైగా ఉంటారు. పందిరి సేద్యం, మల్చింగ్ విధానంలో కూరగాయలను పండిస్తున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లను కూడా వినియోగిస్తున్నారు.

**అన్ని రకాల సాగు ...**

నగర్‌తండాలో రైతులు తీగజాతికి చెందిన బీర, కాకర, చిక్కుడు, సొరకాయ తదితర కూరగాయలను పండిస్తున్నారు. టమాటా, వంకాయ, క్యాబేజీ, గోరుచిక్కుడు, మిరప, కొత్తిమీర, మెంతి, పాలకూర, ఉల్లి కూడా సాగు చేస్తారు. వీటితోపాటు పాలకూర, కొయికూర, పుల్లకూర, గంగావాయిల తదితర ఆకుకూరలను పండిస్తారు.



నగర్‌తండాలో కొత్తిమీర తీస్తున్న మీరాబాయి

మరోవైపు పాడి పశువుల పెంపకం కూడా ఇక్కడ చేపడుతున్నారు. ఉదయం పాలు విక్రయించాక మహిళలు మార్కెట్ వద్దకు చేరుకుని కూరగాయలు అమ్ముతారు. ఉదయం 10 గంటలకు తర్వాత ఇంటికి వచ్చి భోజనం అనంతరం మళ్లీ కూరగాయల తోటలకు వెళ్లి పనులు చేస్తారు. ఇలా ఒక్కో రైతు రోజుకు కనీసం రూ.500కు పైనే సంపాదిస్తున్నారు.

**మార్కెట్‌లో ఇక్కట్లు..**

కూరగాయలు విక్రయించుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. అబ్దుల్లాపూర్, నర్సాపూర్ (జి), ధర్మోర సంతలో మార్కెట్ సౌకర్యం లేక రోడ్లపైనే విక్రయించాల్సి వస్తోంది. సౌకర్యాలు లేనప్పటికీ తైజార్ మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అడిగిన డబ్బులు ఇవ్వకుంటే తమ కూరగాయల ముల్లెలను లాక్కుని వెళ్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతులతోపాటు జింకలు, అడవి పందులు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరుతున్నారు.

**గిట్టుబాటు అవుతోంది..**



మాకున్న అరెకరంలో వివిధ రకాల కూరగాయలను పండిస్తున్నాం. ఉదయం మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముతున్నం. కొందరు తోటల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తారు. మాకు మంచిగానే గిట్టుబాటు అవుతోంది.

– మీరాబాయి, నగర్‌తండా

**డిమాండ్‌ను బట్టి రేటు**



మేము పండించిన కూరగాయలను దళారులకు అమ్మకోం. సాయంత్రం కూరగాయలు తెంపి ఉదయం మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నం. డిమాండ్‌ను బట్టి రేటు వస్తుంది.

– అనూషబాయి, నగర్‌తండా

# మెనూ ప్రకారం భోజనం అందించాలి



కేజీబీవీలో సరుకులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది

**నర్సాపూర్(జి):** విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ సూచించారు. సోమవారం మండలకేంద్రంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వంటగది, నిత్యావసర సరుకులు, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థినులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్ఐ వేణుగోపాల్, ప్రత్యేక అధికారిణి వీణ ఉన్నారు.

**బాలికలకు ఉన్నత చదువులు చెప్పించాలి**

**నర్సాపూర్(జి):** బాలురతో సమానంగా బాలికలకు అవకాశాలు కల్పించి.. ఉన్నత చదువులు చెప్పించాలని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ అన్నారు. బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మండలకేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు.

# నర్సరీల నిర్వహణపై దృష్టి సారించాలి



సింగాపూర్‌లో నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీవో

**ఖానాపూర్:** ప్రతీ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని సింగాపూర్ గ్రామంలో పర్యటించి గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి కేంద్రంలో చిన్నారుల హాజరు, సరుకుల పంపిణీ విషయం గురించి అడిగి తెలుసుకున్నారు.

**తానూరు:** నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని ఈజీఎస్ ఏపీవో గంగాధర్ అన్నారు. సోమవారం మండలంలోని ఎల్వి గ్రామంలో ఉపాధిహామీ ,గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఆయన పరిశీలించి మాట్లాడారు. వివిధ పండ్లు, పూల మొక్కలు పెరిగేలా చూడాలని పేర్కొన్నారు. వంద రోజులు పూర్తికాని కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ఎఫ్ఏ నరేశ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# 'ఆరు గ్యారంటీలు అమలు చేయాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**భైంసారూరల్:** ఈనెల 20న నిర్వహించే చలో హైదరాబాద్ పోస్టర్‌నుసోమవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి జె.రాజు సోమవారం మండలంలోని హంపోలి గ్రామంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొందరికే రుణమాఫీ చేశారన్నారు. రైతుభరోసా కింద రూ.15వేలకు బదులు రూ.12వేలు అందిస్తున్నారని వాపోయారు. అర్హులందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు, నిరుద్యోగ భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భైంసా డివిజన్ నాయకులు దీనాజీ, విఠల్, సాయినాథ్, బాబు, సురేశ్, ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

**దస్తురాబాద్:** నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండలంలోని బుట్టాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయంలో నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆలయాలకు కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, రమేశ్‌రావ్, కిషన్, వెంకన్న, నరేశ్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేశం, రంజిత్, ఆనంద్, నాగరాజు, శేఖర్, అంజన్న తదితరులున్నారు.



దస్తురాబాద్: ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, నాయకులు



ఖానాపూర్ : దేవునిగూడెంలో..

**ఖానాపూర్:** మండలంలోని కొలాంగూడ పంచాయతీ పరిధి దేవునిగూడెంలో శ్రీ పార్వతి ఫణీంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పండితులు విష్ణుంబోట్ల రాజశేఖర్‌శర్మ బృందం ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, యంత్రస్థాపన, శాంతి పౌష్టికహోమం, జయాది హోమాలు, ధృక్‌బలి పూర్ణాహుతి, విశ్వరూప సందర్శనం, శ్రీ శివపార్వతుల కల్యాణం తదితర పూజలు చేశారు. ఎర్వచింతల్, బీర్నంది తదితర గ్రామాల భక్తులు, పలు రాజకీయ పార్టీల నాయకులు తరలివచ్చారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బండారి రవీందర్, అడ్వాల చిన్నరాజన్న, కొడారి నరేశ్, కొడారి రవీందర్ తదితరులున్నారు.

**శివాలయంలో అన్నదానం**

**ముధోల్:** మండలకేంద్రంలోని పశుపతినాథ్ మహాశివాలయంలో శివలింగానికి సోమవారం ముధోల్ మహాలక్ష్మీ గల్లీకి చెందిన స్వామిగౌడ్ పాలు, పెరుగు, పంచదార పలు రకాల పండ్లతో అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు ప్రణీత్ మహరాజ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

**భద్రకాళి అమ్మవారికి పూజలు**

**లోకేశ్వరం:** మండలంలోని పంచగుడి గ్రామంలో వీరభద్రస్వామి సమేత భద్రకాళి అమ్మవారికి సోమవారం వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం సభ్యులు పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సారంగపూర్: పూజలు చేస్తున్న పండితులు

**సారంగపూర్:** మండలంలోని దేవరలొద్ది ప్రభులింగేశ్వరస్వామి ఆలయంలో మూడురోజుల కిందట ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ముగిశాయి. సోమవారం ఉదయం హనుమాన్ సహిత నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలతోపాటు ప్రభులింగేశ్వర స్వామి విగ్రహం, లక్ష్మీనర్సింహాస్వామి విగ్రహం, సంతాన లక్ష్మీదేవి విగ్రహాలను ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రతిష్ఠించారు. అనంతరం తరలివచ్చిన భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వేదపండితులు శ్రావణ్‌కుమార్ జోషి, సంతోష్ శర్మ, వీడీసీ సభ్యులు, ఆలయ ధర్మకర్త లక్కడి అనిత రాజశేఖర్ ఉన్నారు.

# 'నేతకానీల కులగణన మళ్లీ చేపట్టాలి'



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

**కడెం:** నేతకానీల కులగణన మళ్లీ నిర్వహించాలని నేతకాని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గె వెంకటేశ్‌నేత ఆరోపించారు. సోమవారం మండలంలోని అంగడీశ్వర శివాలయంలో కొత్తమద్దిపడగ, మాసాయిపేట్, నచ్చన్‌ఎల్లాపూర్, పెత్తర్పు గ్రామాల నేతకాని కులస్తులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నేతకానిల జనాభా సుమారు 18 లక్షలు ఉండగా.. కులగణనలో మాత్రం తప్పుడు లెక్కలు చూపుతున్నారని వాపోయారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో నేతకానిల జనాభా ఎక్కువ ఉందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణతో నేతకానిలకు అన్యాయం జరిగిందని.. రాష్ట్ర ప్రభుత్వం నేతకానీలకు ఆరు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోచయ్య, జడ కృషయ్య, గంగాధర్, రాజేందర్, పోషన్న, రాజన్న, శంకర్, గంగాధర్ తదితరులున్నారు.

# ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించరూ



ధర్మారం సమీపంలో రోడ్డు దుస్థితి..



మల్లాపూర్ సమీపంలో రోడ్డు

**లక్ష్మణచాంద:** మండలంలోని ధర్మారం గ్రామం నుంచి మల్లాపూర్, మునిపెల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు అధ్వానంగా తయారైంది. ధర్మారం –మల్లాపూర్(మూడు కిలోమీటర్లు), మల్లాపూర్ –మునిపెల్లి(రెండు కిలోమీటర్లు) రోడ్లపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వాహనదారులు కింద పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# కేసీఆర్ జన్మదిన వేడుకలు

**ఖానాపూర్:** మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం పట్టణంలో నిర్వహించారు. పార్టీ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి జగన్నాథ్‌రావు చౌరస్తాలో కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లను పంపిణీ చేశారు. రాజగంగన్న, రాజు, ప్రదీప్, శ్రావణ్, ఖలీల్, నారాయణరావు, సరోజ, సుమిత్, రాజన్న, శేఖర్ ఉన్నారు.

**నిర్మల్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము మొక్కలు నాటారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సుభాశ్‌రావు, నెల్ల అనిల్, లక్ష్మణచారి, జీవన్‌రెడ్డి, నజీరుద్దీన్, విశాల్, రమణ పాల్గొన్నారు.

**దస్తురాబాద్:**మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్యయాదవ్, రాజనర్సయ్య పాల్గొన్నారు.

**కుంటాల:**మండలంలోని కల్లూరులో బీఆర్ఎస్ నాయకులు రహదారిపై మొక్కలు నాటారు. పార్టీ కన్వీనర్ పడకంటి దత్తాద్రి, దశరథ్, చిన్నారెడ్డి, దాసరి కిషన్, రవి, సద్దాం, ప్రసాద్ పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో మొక్క నాటుతున్న జాన్సన్ నాయక్, నాయకులు



నిర్మల్‌లో మొక్క నాటుతున్న బీఆర్ఎస్ నేతలు

**కడెం:** మండలంలోని లింగాపూర్‌లో జాన్సన్ నాయక్ మొక్కలు నాటారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, కమ్మల స్వామి, రఫీక్, గంగన్న, లచ్చన్న, తిరుపతిరెడ్డి, విజయ్ ఉన్నారు.

**ముధోల్:** మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బీఆర్ఎస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త కిరణ్ కొమ్రెవార్, గంగాధర్, అంజయ్య ఉన్నారు.

**లోకేశ్వరం:** మండలంలోని రాయపూర్‌కాండ్లీలో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు రమాదేవి, ప్రశాంత్, పాల గంగాధర్, సందీప్, రాజు, సాయినాథ్, కిషన్ ఉన్నారు.

**భైంసాటౌన్:** బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ పి.రమాదేవి తన నివాసంలో కేక్ కట్ చేశారు. మొక్కలు నాటారు. స్థానిక ఏరియాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

### ప్లాస్టిక్ వినియోగం నియంత్రించాలి

**ఖానాపూర్:** పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని కోరుతూ యంగ్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. హోటళ్లు, చికెన్, మటన్ మార్కెట్లు తదితర చోట్ల విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగిస్తుండటంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని సభ్యులు పేర్కొన్నారు. యూత్ అధ్యక్షుడు షకీల్, సభ్యులు పాల్గొన్నారు.

## జీనియస్ అవార్డులు అందుకున్న విద్యార్థులు

**తానూరు:** మండలకేంద్రంలోని వాగ్దేవి పాఠశాల విద్యార్థినులు ఆదివారం హైదరాబాద్‌లోని నాంపల్లి తెలుగు లలిత కళాతోరణం గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 32వ సీవీరామన్ యంగ్ జీనియస్ ఒలింపియాడ్ అవార్డు అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ అరవింద్‌రెడ్డి తెలిపారు. నిర్మల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో 32వ సీవీ రామన్ యంగ్ జీనియస్‌లో పాఠశాల విద్యార్థినులు సమృద్ధి, తేజ్‌ప్రీత్ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఈ అవార్డులను సినీనటుడు రావురమేశ్ విద్యార్థులకు అందించారు. సోమవారం అవార్డు అందుకున్న విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కరస్పాండెంట్ అవినాష్, ప్రిన్సిపాల్ ఉమాకిరణ్‌మాయిలు తదితరులు ఉన్నారు.



అవార్డు అందుకున్న విద్యార్థి, పక్కన రావురమేశ్

### అటెన్షన్ ప్లీజ్..

**చెట్టు తొలగించరూ..**



**లోకేశ్వరం:** మండలకేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆదివారం చెట్టు విరిగి కిందపడిపోయింది. సోమవారం కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కిందపడిన చెట్టును తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: గిరిరాజ్, మండల వ్యవసాయాధికారి, లోకేశ్వరం,
ఫోన్ : 72888 77916

**పరామర్శ**

**ఖానాపూర్:** మండలంలోని సత్తనపల్లి, సుర్జాపూర్ గ్రామాల్లోని పలు బాధిత కుటుంబాలను సోమవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ జాన్సన్‌నాయక్ వేర్వేరుగా పరామర్శించారు. ఆయన వెంట బూసి నరేందర్, మోహిద్, శ్రీనివాస్, రాజేశ్వర్, కృష్ణ, హరీశ్, తదితరులు ఉన్నారు.